క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జేష్టమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్య స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

2 నుంచి ప్రవచనాలు

ప్రొద్దుటూరు : స్థానిక పాత మార్కెట్‌లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో జూన్ 2వ తేదీ నుంచి 7వతేదీ వరకు శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రోజు సాయంత్రం 6.15 గంటల నుంచి 7.45 గంటల వరకు శివదర్శనానంద సరస్వతి మాతాజీ మహాభారతంలోని ఆధ్యాత్మిక, భక్తి ప్రవచనాలు చేస్తారని వారు పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

ప్రొద్దుటూరు: నిత్యం యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని శ్రీ వివేకానంద యోగా ఇన్‌స్టిట్యూట్, హోలిస్టిక్ హెల్త్ సొసైటీ యోగా మాస్టర్లు బి.తిరుపాలయ్య, తేజశ్రీ తెలిపారు. యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పశువైద్య కళాశాలలో శనివారం యోగాపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా చేస్తే ప్రశాంతమైన మనస్సుతో ఒత్తిడిని అధిగమించ వచ్చునని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సూర్యనమస్కారాలు, పలు రకాల యోగాసనాలు ప్రాణాయామం నేర్పించారు.

మెలకువలు పాటిస్తే దిగుబడి

బి.కోడూరు : వ్యవసాయంలో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పోరుమామిళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్ తెలిపారు. శనివారం మండలంలోని మేకవారిపల్లె రైతుసేవా కేంద్రంలో రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పురుగు మందుల వాడకం, విత్తనాల ఎంపికపై సూచనలు అందించారు. వ్యవసాయాధికారి కౌశిక, రామయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పరామర్శ



మల్లారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేల్ అర్బన్ : ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని మండల పరిధిలోని కోనసముద్రం గ్రామంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి తండ్రి పోకల మల్లారెడ్డిని శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు అన్ని జాగ్రత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి, రాళ్ళపల్లి నరసింహులు, శేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శివారెడ్డి, కోటయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పర్యటన

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్నాటి వెంకటేశ్వర్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, జెడ్పీటీసీ డి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి ఆహ్వానం మేరకు సత్యనారాయణస్వామి వ్రతంలో వీరు పాల్గొన్నారు. అనంతరం స్థానిక నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంత రెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్ళపల్లి నరసింహులు, వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, విజయరామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా శంకరయ్య

బ్రహ్మంగారిమఠం: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా కార్యవర్గ అధ్యక్షుడిగా శంకరయ్య నియమితులయ్యారు. మండలంలోని అచలానంద ఆశ్రమం వద్ద జరిగిన సమావేశంలో అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జే.వేణుగోపాల్, కేటి వర్మ, ఉపాధ్యక్షులుగా ఏ.బాలకృష్ణారెడ్డి, ఎం.బాలకృష్ణారెడ్డి, సెక్రెటరిగా ఎస్.చెన్నకృష్ణారెడ్డి, పబ్లిసిటి సెక్రెటరీలుగా సి.వెంకటరెడ్డి, రమణయ్య, జాయింట్ సెక్రెటరీలుగా ఎస్.ఆనంద్, సిద్దేశ్వరరావు, ట్రెజరర్‌గా కె.వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, కల్చరల్ సెక్రెటరీలుగా టి.సావిత్రి, కె.మంజుల నియమితులయ్యారు.

ముళ్ల కంపల తొలగింపు

రాజుపాళెం : మండలంలోని చాపాడు కాలువ పరిధిలోని 15వ కిలో మీటరు నుంచి రెండున్నర కిలోమీటర్ల మేర ఉన్న ముళ్ల కంపలను లస్కర్ అబ్దుల్ రహిమాన్ తన సొంత ఖర్చుతో జేసీబీ పెట్టి శనివారం తీసివేయించారు.

అన్నదాతల ఎదురు చూపు

ఏడాదైనా అమలుకాని అన్నదాత సుఖీభవ పథకం



దుక్కులు చేస్తున్న రైతు

ప్రొద్దుటూరు/చాపాడు : నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికార పీఠం ఎక్కి ఏడాది గడిచింది. అయితే ఇప్పటి వరకూ ఆయన ప్రధానంగా ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేదు. రైతులంటే ఆయనకు ఎప్పుడూ చిన్న చూపేనని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రైతులకు రూ.13,500 విడతల వారీగా చెల్లించేవారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.7,500, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6 వేలు ఉండేది. గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు రైతు భరోసా పేరు మార్చి అన్నదాత సుఖీభవగా నామకరణం చేశారు. ఏడాదికి ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇంత వరకూ పథకం అమలుకు నోచుకపోకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతు రుణామాఫీకి సంబంధించి రైతులకు బాండ్లు మంజూరు చేసినా మాఫీ సక్రమంగా అమలుకాలేదు. ఇందుకు అనేక రకాల నిబంధనలను విధించి రైతులకు అన్యాయం చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సుమారు 17వేల మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా ఉన్నారు.

అన్నదాతకు ఎగనామం

అట్లూరు : అన్నదాత సుఖీభవ పథకం అమలుకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ రైతుభరోసా పథకానికి పేరు మార్చడం మినహా.. ఎటువంటి పురోగతి కనిపించలేదు. అయితే తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు 'సూపర్ సిక్స్'లో ప్రకటించారు. బద్వేలు నియోజకవర్గంలో బద్వేలుతో పాటు అట్లూరు, గోపవరం, బి. కోడూరు, కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల మొత్తం ఏడు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో 35,400 మంది రైతులు ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు అధికారంలోకి వస్తే రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇంతవరకు పైసా విదల్చలేదు. ఈ పథకం అమలు ఎప్పుడు అమలు అవుతుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. జూన్ 10వ తేదీ నాటికి రాష్ట్రమంతా వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులు కాస్త ముందుగానే ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే వారికి ప్రభుత్వం నుంచి సాయం కరువైంది. గత ప్రభుత్వంలో మేలోనే రైతుభరోసా అందేది. జూన్ వస్తున్నా సాయం అందలేదని వాపోతున్నారు.

ఈ ఏడాదికి అందాల్సిన నిధుల వివరాలు	
నియోజకవర్గం	మైదుకూరు
రైతులు	36,622
ఏడాదికి ఇవ్వాల్సిన డబ్బు	20వేలు
మొత్తం అందాల్సిన నిధులు	71.24కోట్లు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



వ్యవసాయం చేసేందుకు ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. గతంలో ప్రభుత్వం ఇచ్చే రూ.13,500 ఉపయుక్తంగా ఉండేది. ఎన్నికలకు ముందు చంద్రబాబు రూ.20వేలు ఇస్తామన్నారు. ఏడాది అవుతున్నా అన్నదాన సుఖీభవ పథకం అమలు చేయడంలేదు. కేంద్రంతో సంబంధం లేకుండా రూ.20వేలు ఇస్తే రైతు చేసే వ్యవసాయానికి ఉపయోడపడుతుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

- వేమిరెడ్డి రామలింగారెడ్డి, చెంచయ్యగారిపల్లె గ్రామం, బ్రహ్మంగారిమఠం మండలం

ఇంకా అన్నదాత సుఖీభవ అమలు కాలేదు



రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇంకా అమలు కాలేదు. ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీ ఎప్పుడు అమలవుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. స్పష్టంగా ఇంత వరకు ఈ పథకానికి సంబంధించి తేదీని ప్రకటించలేదు. కేంద్ర ప్రభుత్వం మాత్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద యథావిధిగా రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతోంది.

- కల్లూరు నాగమునిరెడ్డి, రైతు, శంకరాపురం, ప్రొద్దుటూరు మండలం

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామివారిని శేష వాహనంపై ఊరేగిస్తున్న శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం కుంభప్రతిష్ట, అగ్నిప్రతిష్ట, నిత్యహోమం, మూలవిరాట్‌లకు అభిషేకం, ఉత్సవబలి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి శేషవాహనంపై ఉంచి గుడిప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు స్వామివార్లకు కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధన



ఎడిఫై పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : అంతర్జాతీయ ప్రమాణాలతో ఎడిఫై పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాబోధన చేయడం అభినందనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కామనూరు సమీపంలో ఏర్పాటు చేసిన ఎడిఫై ఇంటర్ నేషనల్ స్కూల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కరస్పాండెంట్ వై.అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ఎడిఫైతో ఒప్పందం చేసుకుని పదెకరాల విస్తీర్ణంలో ఉన్నత ప్రమాణాలతో సీబీఎస్‌ఈ సిలబస్ బోధన చేస్తున్నామన్నారు. పెద్ద నగరాల్లో లభించే అత్యుత్తమ విద్య తక్కువ ఫీజుతో అందిస్తున్నామని, వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్‌ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, డాన్స్‌రూం, మ్యూజిక్ రూం, క్రికెట్, సెటిల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, సంగీతం రూంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, గురుదేవ్ రామిరెడ్డి, ఏకే. అగర్వాల్, సురేష్‌నాయుడు, కొండారెడ్డి, భూపేష్‌రెడ్డి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి సత్యకుమారి

ప్రొద్దుటూరు క్రైం : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రొద్దుటూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి తెలిపారు. స్థానికంగా ఉన్న సబ్ జైలును జిల్లా జడ్జి శనివారం తనిఖీ చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ పథకాలు, లీగల్ సర్వీస్ హెల్ప్‌లైన్ నంబర్ ఆవశ్యకత, ఉచిత న్యాయ సహాయం గురించి ఖైదీలకు వివరించారు.

ఆధునిక పద్ధతులతో లాభసాటి వ్యవసాయం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : ఆధునిక పద్ధతులతో లాభసాటి వ్యవసాయాన్ని చేయవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం బి.కోడూరు మండలంలో కార్యక్రమాలను నిర్వహించారు. బి.కోడూరు, మేకవారిపల్లె, ప్రభలవీడు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఆధునిక పద్ధతులతో పంటల సాగు చేస్తే నాణ్యమైన పంటతోపాటు అధిక దిగుబడులను సాధించవచ్చని వివరించారు. జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాం ప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి రైతులకు వివరించారు. పోరుమామిళ్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళీధర్ రెడ్డి తదితరులు భూసార పరీక్షల విలువ ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే ప్రచురించి పంటల సాగు గురించిన వివరాల పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ వైద్యులు శ్రీవల్లి, ఫిరోజ్ హుస్సేన్, విజయ భాస్కర్, కౌశిక తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేని దుకాణాల్లో విత్తనాలు కొనొద్దు



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ కృష్ణమూర్తి

మైదుకూరు : లైసెన్స్ లేని దుకాణాల్లో కానీ, వ్యక్తుల వద్ద రైతులు విత్తనాలు పురుగు మందులను కొనవద్దని మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి సుచించారు. శనివారం మైదుకూరు పట్టణంలోని పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు ఎవరైనా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగదు బిల్లులను రైతులకు ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన మందులను, విత్తనాలను దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదని తెలిపారు. ఏఓ బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు స్టాక్ రిజిస్టార్, బిల్లు పుస్తకాలను అప్‌డేట్ చేసి ఉంచాలని చెప్పారు. ధరల పట్టిక, స్టాక్ బోర్డు అప్‌డేట్ చేయాలని సూచించారు. అనుమతి లేని ఉత్పత్తులను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్‌లు లేకుండా గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే, అనుమతి ఉన వాటిని మాత్రమే కొనుగోలు చేసి నగదు బిల్లుల పొంది భద్రపరచుకోవాలన్నారు. గ్రామాల్లో అనామక వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసి మోసపోవద్దని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తనాలు, ఎరువులను దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గుర్తింపు కలిగిన కంపెనీల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అనుమతి లేని విత్తనాలను రైతులకు విక్రయించరాదని, ఒకవేళ అలా జరిగితే రైతుల ఫిర్యాదు మేరకు సంబంధిత దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలను దుకాణాల్లో ఎట్టిపరిస్థితుల్లో ఉంచరాదన్నారు. స్టాకు, బిల్లు పుస్తకాలను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధరల పట్టిక అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. గ్రామాల్లో అనుమతిలేని విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే అనుమతి ఉన్న వాటిని మాత్రమే రైతులు కొనుగోలు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని డీలర్లకు సూచించారు.

సావిత్రమ్మ సేవలు ప్రశంసనీయం



సావిత్రమ్మ దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చాపాడు : అంగన్వాడీ కార్యకర్త నుంచి వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తూ సీడీపీఓ స్థాయికి ఎదిగి ఉద్యోగ విరమణ చేయడం వరకూ సావిత్రమ్మ సేవలు ప్రశంసనీయమని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్ట్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా పని చేస్తున్న సావిత్రమ్మ ఉద్యోగం విరమణ పురస్కరించుకుని స్థానిక వైఎస్ కళ్యాణ మండపంలో శనివారం వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. సావిత్రమ్మ అంగాన్వాడీ వర్కర్‌గా విధుల్లో చేరి క్రమేపి సూపర్‌వైజర్, సీడీపీఓగా రాణించి 44 ఏళ్ల పాటు విధులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య మాట్లాడుతూ.. చాపాడులో మొదటి సారిగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏర్పాటైనప్పుడు సీడీపీఓగా సావిత్రమ్మ బాధ్యతలు చేపట్టి ప్రాజెక్టును ముందంజలో నిలిపారన్నారు. అనంతరం సావిత్రమ్మ దంపతులను ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, బంధువులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీర కిషోర్, వేముల ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, ఏఓ రామానుజం, ఎంఈఓలు రవి శంకర్, వంశీకృష్ణ, వివిధ ప్రాజెక్టుల సీడీపీఓలు హైమావతి, రాజేశ్వరి, ముంతాజ్ బేగం, శ్రీదేవి, లక్ష్మీదేవి, సునీత, శోభారాణి పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలను కాపాడుకుందాం

- వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి
- వాడీవేడిగా ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో విలువైన మున్సిపల్ స్థలాలను ఆక్రమించకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్లు బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. బయటి వ్యక్తులు కొందరు కౌన్సిల్ హాల్‌లో కూర్చోవడంతో వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా అభ్యంతరం చెప్పారు. సభకు సంబంధం లేని వ్యక్తులు బయటికి వెళ్లాలని చెప్పడంతో చైర్ పర్సన్ ఆదేశాల మేరకు వారిని బయటికి పంపించారు. గంగమ్మఆలయం ముందు భాగాన కొందరు వ్యక్తులు షాపింగ్ గదులు ఏర్పాటు చేసుకొని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వైస్‌చైర్మన్లు సభ దృష్టికి తెచ్చారు. ప్రహరీ నిర్మించడంలో తమకు అభ్యంతరం లేదని, అయితే కొందరు ఆలయం ఎదుట ప్రధాన రహదారి పక్కన గదులను నిర్మిస్తున్నారని తెలిపారు. అందుకు సంబంధించిన స్ట్రీట్ సర్వే రికార్డులను పరిశీలించి నిర్మాణాలను ఆపి, మున్సిపల్ స్థలాలను కాపాడాలని వారు కోరారు. రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటానని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శివాలయం సెంటర్‌లోని పురపాలక స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా కంటైనర్‌ను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారని వైస్ చైర్మన్లు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. గతంలో పలుమార్లు తొలగించాలని చెప్పినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదని, అక్కడ పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు చేస్తే మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని సూచించారు. కంటైనర్ తొలగింపుపై స్పష్టమైన సమాధానం రాకపోవడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. వారం రోజుల్లో కంటైనర్‌ను తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో ఉన్న షెడ్లు తొలగించేందుకు అభ్యంతరాలు ఏముంటాయని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వచ్చిన తర్వాత దానిపై నిర్ణయం తీసుకుందామని కమిషనర్ చెప్పడంతో సభ్యులు అభ్యంతరం చెప్పారు. కౌన్సిల్‌కు చైర్ పర్సన్ సుప్రీం అన్న విషయాన్ని అధికారులు, సభ్యులు గుర్తుపెట్టుకోవాలన్నారు. చైర్ పర్సన్ తీసుకున్న నిర్ణయాలే ఇక్కడ అమలవుతాయన్నారు. దీంతో చేసేదేమి లేక అక్కడి షెడ్డును కూడా తీసేస్తామని కమిషనర్ చెప్పారు.

పది శాతం లెస్ వేస్తే రద్దు చేయమని ఎమ్మెల్యే చెప్పారు

అజెండాలోని పలు అంశాలను కౌన్సిల్ సభ్యులు తిరస్కరించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో గతంలో కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పది శాతం లెస్ వేసిన టెండర్లకు ఆమోదం తెలపవద్దని, తిరస్కరించాలని చెప్పడంతో గతంలో వాటిని రద్దు చేశారని కౌన్సిలర్లు తెలిపారు. అంచనా రేటు కంటే తక్కువ కోడ్ చేసిన టెండర్లను ఆమోదించి మున్సిపల్ ఆదాయానికి గండికొట్టరాదని సూచించారు. ఈ క్రమంలో పలు వార్డుల్లో పనులు చేపట్టేందుకు పిలిచిన టెండర్లను శనివారం కౌన్సిల్ ముందు ఉంచారు. అయితే వాటిలో చాలా వరకూ పది శాతం లోపు లెస్ వేసిన టెండర్లే ఉండటంతో ఏకగ్రీవ కౌన్సిల్ సభ్యుల తీర్మానం మేరకు రద్దు చేస్తునట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి ప్రకటించారు. పది శాతం లోపు లెస్ వేసిన టెండర్లకు ఆమోదం తెలపవద్దని ఎమ్మెల్యే, ఎక్స్‌ఆఫీషియో సభ్యుడు నంద్యాల వరదరాజులరెడ్డి చెప్పారని, ఆయన మాటను గౌరవిస్తూ వాటిని రద్దు చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. అనారోగ్య కారణాల రీత్యా తమ స్థానంలో వారి కుటుంబ సభ్యులను పారిశుధ్య కార్మికులుగా కొనసాగించాలనే ప్రతిపాదనలను 39 నుంచి 46 అంశాల్లో చేర్చారు. వైస్ చైర్మన్లు బంగారుమునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజాలు మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో విధులు నిర్వర్తించలేని పరిస్థితుల్లో వారి స్థానంలో కుటుంబ సభ్యులను తీసుకోవడం అనేది పురపాలక సంఘంలో సాంప్రదాయంగా వస్తోందని చెప్పారు. మానవతా దృక్పథంతో ఈ అంశాలను ఆమోదం తెలుపుతున్నామని చెప్పారు. దీనికి కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి అభ్యంతరం చెప్పగా, సభలోని 17 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పారిశుధ్య కార్మికులకు సంబంధించిన అంశాలను ఆమోదించాలని కోరుతూ చేతులెత్తారు. దీంతో కౌన్సిల్ ఆమోదం లభించింది. తమ వార్డుల్లోని వీధుల్లో లైట్లు వెలగడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి, కౌన్సిలర్లు శివజ్యోతి, బాలాజి సమావేశం దృష్టికి తెచ్చారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో పబ్లిక్ టాయిలెట్‌ను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ జిలానిబాషా కోరారు. పరిశీలించి మంజూరు చేస్తానని కమిషనర్ చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు రాచమల్లు రమాదేవి, వరికూటి ఓబులరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం మూడు రోడ్ల కూడలిలో శనివారం పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో కాశినాయన ఎస్ఐ యోగేంద్ర పాల్గొన్నారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి

ప్రొద్దుటూరు : సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి కోరారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ వాసులకు నికర జలాలు అందించేందుకు కృష్ణానదిపై సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని తీర్మానించారన్నారు. 1951లోకేంద్ర జల సంఘం అనుమతులు చేసినా.. ఇప్పటికీ పూర్తి కాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో మునిసుబ్బారెడ్డి, రామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మార్తల శ్రీనివాసులరెడ్డి, రామోహన్ రెడ్డి, మల్లికార్జున శెట్టి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం



ర్యాలీ నిర్వహిస్తున్నఓబుళరెడ్డి, తదితరులు



చాపాడులో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: పొగాకు ఉత్పత్తులను సేవించడం, తినడం ఆరోగ్యానికి హానికరమని కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలిపారు. పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శనివారం సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు, వాటి వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఎంవీ.సుబ్బారెడ్డి, చెన్నమ్మ, గంగాభవాని, రమణమ్మ, నరసింహారెడ్డి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

చాపాడు : ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ధూమపానాన్ని దూరం పెట్టాలని మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది యువత, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ధూమపానం నివారించేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయ ఈఓగా వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయం, శ్రీకృష్ణ గీతాశ్రమం ఈఓగా గండి దేవస్థానం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో కె.రామచంద్రాచార్యులు శనివారం పదవీ విరమణ పొందారు. దేవాదేయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు గండి దేవస్థానం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య అగస్త్యేశ్వరస్వామి ఆలయ, శ్రీకృష్ణ గీతాశ్రమం పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్నారు.

రహదారి భద్రతపై అవగాహన

కడప కార్పొరేషన్ : రహదారి భద్రతపై అందరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎంఎస్‌ఐ సిబ్బంది తెలిపారు. హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్‌ఎంఎస్‌ఐ) ఆధ్వర్యంలో రహదారి భద్రతపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. అనంతరం ఈ-గురుకుల్ వినూత్న డిజిటల్ రోడ్ సేఫ్టీ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించిందని తెలిపారు. ఈ ప్లాట్‌ఫాంలో ఎల్లలకు అనుగుణంగా శిక్షణా మాడ్యూల్స్ అందిస్తోందన్నారు.

